ప్రజాశక్తి
మంగళవారం 1 జూలై 2025
5
విజయనగరం

ఫేషియల్ రికగ్నైజ్డ్ సిస్టం తప్పనిసరి

ఐసిడిఎస్ పీడీ విమలా రాణి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

కేంద్రప్రభుత్వం ఆదేశాల మేరకు అంగన్వాడీ కేంద్రాల్లో నమోదైన గర్భిణీ స్త్రీలు, బాలింతలతో పాటు 7 నెలల నుండి 3 సంవత్సరాల లోపు పిల్లలకు పోషణ్ ట్రాకర్ అప్లికేషన్‌లో 'ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టం అనేది తప్పనిసరి అని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ విమలారాణి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 49,445 మంది లబ్దిదారులకు గాను ఇప్పటి వరకు 46610 మంది లబ్దిదారులకు (94.27శాతం ఫేస్ కేప్చర్ ను పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన లబ్ధిదారులకు పూర్తి చేయాల్సి ఉందన్నారు. అంగన్వాడీ సెంటర్‌లో నమోదైన లబ్ధిదారులకు జూలై ఒకటి నుండి టిహెచ్ఆర్ డిస్ట్రిబ్యూషన్ అనేది కేవలం ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్ ద్వారానే జరుగుతుందని తెలిపారు.

వృథాగా తాటిపూడి నీరు

అధ్వానంగా సాగునీటి కాలువలు ● ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచని వైనం

తాటిపూడి రిజర్వాయర్ నీరు వృథాగా పోతోంది. పాలకుల నిర్లక్ష్యం కారణంగా శివారు భూములకు సాగునీరందించడంలో చతికిలబడుతోంది. ఏళ్ల తరబడి కాలువలు మరమ్మతులకు నోచుకోక పోవడంతో శివారు భూములకు సాగునీరు అందడం లేదు. మరోవైపు రిజర్వాయర్ స్పిల్‌వే వద్ద గేట్లు మరమ్మతులకు గురవ్వడంతో నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాధుడు లేడు. ఫలితంగా రైతులకు సాగునీరు అందని ద్రాక్షగానే ఉంటోంది.

తాటిపూడి రిజర్వాయరు

గేట్లు సక్రమంగా లేక వృథాగా పోతున్న సాగునీరు

ప్రజాశక్తి-గంట్యాడ

1968లో నిర్మించిన తాటిపూడి రిజర్వాయర్ గంట్యాడ, ఎస్.కోట, జామి మండలాల పరిధిలో 35 గ్రామాల రైతులకు జీవనాధారంగా ఉంది. 62 కిలోమీటర్ల పరిధిలో 15,378 ఎకరాలకు సాగునీరు, విజయనగరం, విశాఖ నగర ప్రజలకు తాగునీరు అందించేందుకు 297 అడుగుల నీటి నిల్వ సామర్థ్యంతో ఈ ప్రాజెక్టును నిర్మించారు. ఆయకట్టు కాలువలు మరమ్మతులకు గురవ్వడంతో ఏటా సాగునీరు వృథాగా పోతోంది. దీంతో శివారు ప్రాంతాల భూములకు సాగునీరు అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి సంవత్సరం ఇదే పరిస్థితి ఏర్పడుతుందని, దీనివల్ల పంట నష్టం వాటిల్లుతోందని వాపోతున్నారు. మరోవైపు స్పిల్‌వే గేట్ల వద్ద తరచూ లీకులు ఏర్పడడంతో ప్రాజెక్టులోని నీరు నదిలోకి వృథాగా పోతోంది. రిజర్వాయర్ నుండి బోనంగి, పెంట శ్రీరాంపురం ముతా ఛానల్ ద్వారా చివర గ్రామాలకు సాగునీరు వెళ్తుంది. ఈ రెండు పెద్ద కాలువల నుంచి ఇతర గ్రామాల పొలాలకు నీరు చేరుతుంది. అయితే పెంట శ్రీరాంపురం ముతా ఛానల్ నుండి మధుపాడ వెళ్లే కాలువకు ధోని పాడై పోవడంతో నీరు వృథాగా పోతుంది. మరోవైపు కాలువల్లో పిచ్చి మొక్కలు పెరిగిపోయి మట్టి చేరడంతో శివారు గ్రామాలకు సాగునీరు అందకుండా పోతోంది.

ఈ విషయాన్ని రైతులు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు తెలియచేసినప్పటికీ పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బోనంగి నుంచి చిన్న వేములపల్లి ముతా ఛానల్‌కు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.అలాగే పెంట శ్రీరాంపురం ఛానల్ పై బ్రిడ్జి లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

నిధులు మంజూరైనా

తాటిపూడి ఆయకట్టు కాలువల మరమ్మతులకు రూ.70 లక్షలు నిధులు మంజూరైనట్లు ఆయకట్టుదారుల సంఘం నాయకులు తెలిపారు. మదనాపురం ఛానల్‌కు రూ.8.50లక్షలు, తాటిపూడి ఛానల్‌కు రూ.8లక్షలు, బోనంగి ఛానల్‌కు రూ.6లక్షలు, వసంత, రామభద్ర పురం, పెంట శ్రీరాంపురం ఛానల్ , కొర్లాం ఛానల్‌కు చెరో రూ.లక్ష, జామి పరిధిలో రూ.8లక్షలు, వేములపల్లి ఛానల్‌కు రూ.5 లక్షలు, జాగరం ఛానల్‌కు రూ.5 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఖరీఫ్ సీజన్ వచ్చినా కాలువలకు మరమ్మతులకు చేపట్టకపోవడంతో ఈ ఏడాది కూడా శివారు భూములకు సాగునీరు అందే పరిస్థితి లేదని వాపోతున్నారు.

కల్వర్టులకు మరమ్మతులు చేపట్టాలి

కల్వర్టులు సక్రమంగా లేకపోవడంతో నీరు వృథాగా పోతోంది. వెలగాడ, పొల్లంకి కాలువలు సక్రమంగా లేకపోవడంతో రామభద్రపురం, మోకాలపాడు గ్రామాలకు సాగునీరు అందడం లేదు. బోనంగి కాలువ వద్ద గోడ కట్టవలసిన అవసరం ఉంది. కాలువలో రాళ్లు అడ్డంగా పెట్టి నీటిని మళ్లించవలసి వస్తుంది. సంబంధిత అధికారులు నాయకులు స్పందించి సాగు భూములకు సక్రమంగా నీరందించాలి.

- పెంట అప్పారావు, మోకాళ్లపాడు గ్రామం

సక్రమంగా నీరందడం లేదు

కలవర్టులు సక్రమంగా లేకపోవడంతో తాటిపూడి రిజర్వాయర్ నీరు సక్రమంగా అందడం లేదు. కాలువలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో శివారు భూములకు నీరందడం లేదు. పొలాల నుంచి గోస్తని నది లోకి నీరు వృథాగా పోతుంది. దీనివలన ఉబాలు అయినప్పుడు చాలా ఇబ్బందులు పడుతున్నాం. పెంట శ్రీరాంపురం కాలువ నుండి మధుపాడకు నీరు వచ్చిన ప్రాంతంలో పెంట శ్రీరాంపురం రైతులు అడ్డుపెట్టడంతో నీరు రాక రైతులు అనేక ఇబ్బందులు గురవుతున్నారు. ఆ ప్రాంతంలో కలవర్టును నిర్మిస్తే ఈ రెండు గ్రామాలకూ నీరందుతుంది.

- ద్వారపు రెడ్డి సత్యారావు, మధుపాడ గ్రామం

పిచ్చి మొక్కలతో నిండి ఉన్న ఆయుకట్టు కాలువ

25శాతం సీట్లు ఇవ్వని

ప్రయివేటు స్కూళ్లపై కలెక్టర్ ఆగ్రహం

తనిఖీలు చేపట్టిన ఆర్‌డిఒ, డిఇఒ ● ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యాహక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు 25శాతం సీట్లు ఇవ్వని ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలపై కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ప్రజాశక్తిలో 'విద్యా హక్కు చట్టానికి తూట్లు.. పూర్తికాని 25 శాతం ఉచిత సీట్లు భర్తీ' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్ స్పందించారు. సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో డిఇఒ యు.మాణిక్యం నాయుడును వెంటనే 25శాతం సీట్లు ఇవ్వని ప్రైవేటు స్కూళ్లను తనిఖీ చేసి సీజ్ చేయాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డిఇఒ, ఆర్‌డిఒ సవరమ్మ నగరంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్, సన్ స్కూల్, భాష్యం, బీసెంట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌ను తనిఖీ చేశారు. రికార్డులు తనిఖీ చేసి 25 శాతం ప్రకారం కేటాయించిన సీట్లు భర్తీ చేశారో లేదోనని పరిశీలించారు. డిఇఒ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు, విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లు భర్తీ చేయాల్సిందేనని తెలిపారు. అయితే ఈ స్కూళ్లలో విద్యార్థుల పేర్లు ఆన్ లైన్లో నమోదు ఆలస్యం అవ్వడంవల్ల కొన్ని ఇబ్బందులు ఉన్నట్లు తనిఖీలో తేలిందన్నారు. సోమవారం సాయంత్రానికి 25శాతం కోటాలో భర్తీ అయిన సీట్లు, విద్యార్థుల వివరాలు కార్యాలయానికి ఇవ్వాలని ఆదేశించారు. రిపోర్ట్ ఇచ్చిన తర్వాత జిల్లా కలెక్టర్ ఆదేశాలు ప్రకారం చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

ప్రయివేటు పాఠశాలలో తనిఖీ చేస్తున్న డిఇఒ, ఆర్‌డిఒ

4న జెడ్‌పి సర్వ సభ్య సమావేశం

విజయనగరం : జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం ఈ నెల 4న జెడ్‌పి సమావేశ మందిరంలో జరుగుతుందని జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని తెలిపారు.

జాతీయ సమ్మెలో స్కూల్ ఆయాలు

విజయనగరం టౌన్ : జూలై 9న జరిగే జాతీయ సమ్మెలో ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఆయాలు పాల్గొంటారని యూనియన్ జిల్లా కార్యదర్శి బి.సుధారాణి తెలిపారు. సోమవారం డిప్యూటీ డిఇఒకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కనీస వేతనం అమలు చేయాలని, ప్రతినెలా 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని, స్కూల్ ఆయాలకు వేసవి సెలవుల్లో పని చేసినందుకు పూర్తి వేతనం ఇవ్వాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలనీ, శానిటేషన్ పరికరాలు ప్రభుత్వమే సరఫరా చేయాలని, ప్రమాద బీమాసౌకర్యం కల్పించాలని కోరుతూ సమ్మెలో పాల్గొననున్నట్లు తెలిపారు. వినతి అందించిన వారిలో నరసమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

నేను వైసిపిలోనే ఉన్నాను

ఎమ్మెల్సీ రఘురాజు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'ఔను...! నేను వైసిపిలోనే కొనసాగుతున్నాను... ఎమ్మెల్సీ పదవిపై అనర్హత కోసం ప్రయత్నం జరిగింది తప్ప, పార్టీ నుంచి ఇంకా తప్పించలేదు' అని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. 'ఆయన ఇంతకీ ఏపార్టీ' అంటూ ప్రజాశక్తిలో కథనం వచ్చిన విషయం విధితమే. దీనిపై ఆయన స్పందించారు. ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలకు తనను పిలవకపోవడం వల్లే హాజరు కావడం లేదని చెప్పారు. ఇదే విషయమై ఒకసారి పార్టీ జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావును కూడా కలిశానని చెప్పారు. టిడిపి కార్యక్రమాలకు తాను ఎప్పుడూ హాజరు కాలేదని, ఆ పార్టీతోనూ తనకు సంబంధం కూడా లేదని చెప్పారు. ఇప్పటికైనా పిలుపు వస్తే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ప్రజా జీవితంలో ఉన్నప్పుడు సమస్యల పరిష్కారం కోసం పార్టీలకతీతంగానే పనిచేయాల్సి వుంటుందని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అంతమాత్రాన పార్టీ మారిపోయినట్టు కాదన్నారు. పార్టీతో తనకు ఎలాంటి విభేదాలూ లేవని తెలిపారు.

విద్యాదానం మహాదానం

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ● ప్రాథమిక పాఠశాల భవనం ప్రారంభం

ప్రజాశక్తి-గజపతినగరంరూరల్

విద్యాదానం మహాదానమని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ఫ్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గజపతినగరం మండలం కెంగువ గ్రామంలో సుమారు రూ.55లక్షల వ్యయంతో నిర్మించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని మంత్రి శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. ఈ భవన నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించిన ప్రముఖ వ్యాపారవేత్త కేశవ్‌కుమార్, రౌండ్‌టేబుల్ ఇండియా విఆర్‌టి 77 సంస్థను, అందుకు కృషి చేసిన వేద యువజన సంఘాన్ని, గ్రామస్తులను మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అత్యంత దయనీయ స్థితిలో ఉన్న ఈ పాఠశాల భవనం స్థానంలో సామాజిక స్ఫూర్తి నింపిన సంస్థలు, వ్యక్తుల సహకారంతో మూడు నెలల్లోనే కొత్త భవనాన్ని నిర్మించామని చెప్పారు. పాఠశాల భవన నిర్మాణానికి సహకరించిన వారి కీర్తి పదికాలాలపాటు నిలిచి ఉంటుందని అభినందించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానానికి చేరుకున్నప్పుడే, వారి సహాయానికి అసలైన విలువ వస్తుందని సూచించారు. జిల్లాలో మంచి పాఠశాలగా పేరు తెచ్చుకోవాలని కోరారు. త్వరలో పాఠశాలకు ప్రహరీగోడను నిర్మిస్తామని చెప్పారు. పాఠశాలలో పిల్లలు ఆడుకోవడానికి అవసరమయ్యే క్రీడా సామగ్రి కొనుగోలుకు వ్యక్తిగతంగా రూ.50వేల ఆర్థిక సహాయాన్ని మంత్రి ప్రకటించారు. పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటుకు రూ.10లక్షలు విరాళం అందించడానికి ముందుకు వచ్చిన అచ్చెంనాయుడును, వ్యాపారవేత్తలు కేశవ్ కుమార్, కుప్పిలి శ్రీను, రౌండ్‌టేబుల్ ఇండియా ఛైర్మన్ దుష్యంత్, ప్రతినిధులు ఆనంద్‌కాల్, మక్సూద్, సరస్వతి విగ్రహం ఏర్పాటుకు ముందుకు వచ్చిన సుంకరి పాపినాయుడు, కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటుకు ముందుకు వచ్చిన విఆర్‌టి 77 సంస్థను, వేద యువజన సంఘం ప్రతినిధులను, మంత్రి సత్కరించారు. గ్రామస్తులు రూ.లక్షా,50వేల విలువైన చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి మోహనరావు, ఎంఇఒలు ఎస్.విమలమ్మ, బి.సాయి చక్రధర్, పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ రాపాక తవిటినాయుడు, టిడిపి నాయకులు మక్కువ శ్రీధర్, ఎస్.కుమార్, మజ్జి గోవింద్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి శ్రీనివాస్

పిజిఆర్‌ఎస్‌కు 172 వినతులు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్‌ఎస్‌లో కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రజల నుండి వినతులు స్వీకరించారు. పిజిఆర్‌ఎస్ కు 172 వినతులు అందాయి. కలెక్టర్ తో పాటు సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్, డిఆర్‌ఒ శ్రీనివాస మూర్తి, ఆర్‌డిఒ సవరమ్మ, డిప్యూటీ కలెక్టర్ మురళీ, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. భూ సమస్యలకు సంభందించి రెవిన్యూ శాఖకు అత్యధికంగా 69 వినతులు అందాయి. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ ప్రతి రోజు లాగిన్ అయి అధికారులు వినతులను చూడాలని, రీ ఓపెన్ కేసులు కూడా పూర్తిగా విచారణ జరిపి ముగించాలని తెలిపారు. ఆడిట్ లో కూడా పెండింగ్ లేకుండా చూడాలన్నారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

జిందాల్ బాధితుల కోసం ప్రత్యేక అధికారిని నియమించండి

జిందాల్ అల్యూమిన కర్మాగారం కోసం 2009లో జరిగిన భూ సేకరణ లో అనేక అవకతవకలు జరిగాయని, ఇందులో రెవెన్యూశాఖ అధికారులు, జిందాల్ యజమానుల పాత్ర కీలకంగా ఉందని వాటిని సరిదిద్ద టానికి కలెక్టర్ వెంటనే ఒక ప్రత్యేక అధికారిని నియమించి భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చెయ్యాలని లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కలెక్టర్‌ను కోరారు. సోమవారం పిజిఆర్‌ఎస్‌లో ఎస్.కోట నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు కాండ్రేగుల ప్రసాద్ ఆధ్వర్యంలో బాధిత రైతులతో కలసి కలెక్టర్‌కు వినతి అందజేశారు.

బడి బస్సు వేయాలని వినతి

వేపాడ : శృంగవరపుకోట డిపో నుంచి బక్కునాయుడుపేట వద్దనున్న ఆదర్శ పాఠశాలకు బస్సు సౌకర్యం కల్పించాలని సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు.. సోమవారం పిజిఆర్‌ఎస్‌లో కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు వినతి అందించారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ప్రయివేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారని, మరికొందరు ప్రయివేటు బడుల్లో చేరుతున్నారని వివరించారు. వెంటనే కలెక్టర్ స్పందిస్తూ తప్పనిసరిగా బస్సు ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. పాఠశాలలకు రవాణా సౌకర్యం లేని గ్రామాల విద్యార్థులకు బస్సు ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని చెప్పారు.

రోడ్డు నిర్మించాలి

మండలంలోని ఆతవ, భూమిరెడ్డిపాలెం, కుదువలస, చందులూరు గ్రామాలకు వెళ్లే మార్గం లేదని, రోడ్డు నిర్మాణానికి ఎన్ఆర్ఇజిఎస్ నిధులు మంజూరు చేయాలని సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు.. కలెక్టర్‌కు వినతి అందించారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ నిధులకు ప్రతిపాదనలు పంపించాలని డ్వామా పీడీని ఆదేశించారు.

జగనన్న కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

విజయనగరంటౌన్ : గుంకలాంలోని జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ కాలనీ వాసులు సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతి అందజేశారు. ఇళ్లు కట్టుకోవాలని నాడు అధికారులు పదే పదే ఒత్తిడి చేసి తమతో అప్పులు చేయించి మరీ ఇళ్లు కట్టించాకని, వేలకు వేలు అద్దెలు చెల్లించలేక సొంత ఇళ్లు కట్టుకుంటే కనీస సదుపాయాలు కల్పించడంలో పాలకులు చిన్న చూపు చూస్తున్నారని ఆవేదన చెందారు. కాలనీలో వర్షం పడితే రోడ్లు బురద మాయంగా మారిపోయి అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి దాపురించిందన్నారు.

చీకటి పడితే లైట్స్ పని చేయవని, విద్యుత్తుశాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని అన్నారు. ఒక 108 అంబులెన్సు, ఆర్ఎంపి వైద్యులను అందుబాటులో ఉంచాలని కోరారు. రేషన్, పింఛను అందరికి అందేలా చూడాలని కోరారు. అనంతరం జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌కు వినతినిచ్చారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో గుంకాలం కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఎస్‌టి కమిషన్ ఛైర్మన్‌కు జిందాల్ నిర్వాసితుల వినతి

విజయనగరం : జిందాల్ యాజమాన్యం పరిశ్రమ ఏర్పాటు చేయనందున తిరిగి తమకు భూములు ఇప్పించాలని కోరుతూ భూ నిర్వాసితులు సోమవారం ఎస్‌టి కమిషన్ డివిజి శంకర్రావుకు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో కలసి వినతి అందజేశారు. జిందాల్ కంపెనీ పరిశ్రమ ప్రారంభించలేదని, దీంతో భూములను తిరిగి అప్పగించాలని, తాటిపూడి రిజర్వాయర్ నీటిని తాగునీరు, సాగునీటి కోసం మాత్రమే వినియోగించాలని, శాంతియుతంగా ఆందోళన చేస్తున్న మమ్మల్ని బెదిరించి, భయాందోళనలకు గురిచేసి దుర్భాషలాడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పారదర్శకంగా సచివాలయ సిబ్బంది బదిలీలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

సచివాలయాల సిబ్బంది బదిలీలు పారదర్శకంగా జరగాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నిబంధనలను అతిక్రమించరాదని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అధికారులకు ఆదేశించారు. సోమవారం పిజిఆర్‌ఎస్ అనంతరం అయన మాట్లాడుతూ నిబంధనల ప్రకారంగా బదిలీలను చేపట్టి నోటీసు బోర్డులో డిస్‌ప్లే చేయాలని సూచించారు. అభ్యంతరాలను స్వీకరించి వాటిని కూడా పరిశీలించాలని తెలిపారు. ఎటువంటి అక్రమాలు జరిగినా చర్యలు తప్పవని అన్నారు. ఈనెల 3న జిల్లా ఇంఛార్జి మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో విజన్ 2047 ప్రణాళికపై సమీక్షా సమావేశం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అదే రోజు జిల్లా స్థాయి విజిలెన్సు అండ్ మానిటరింగ్ కమిటీ రెండవ త్రై మాసిక సమావేశం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ లో జరుగుతుందని, ఈ సమావేశానికి కూడా జిల్లా ఇంచార్జ్ మంత్రి హాజరవుతారని కలెక్టర్ తెలిపారు.

ఉత్తరాంధ్రకు ఏం చేశారో చెప్పండి

కళాకు మాజీ ఎమ్‌పి బెల్లాన సవాల్

ప్రజాశక్తి - చీపురుపల్లి

టిడిపి హయాంలో ఉత్తరాంధ్రకు మీరు ఏం చేసారో చెప్పాలని మాజీ ఎంపి బెల్లాన చంద్రశేఖర్ చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావును ప్రశ్నించారు. సోమవారం ఆయన నివాశంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బెల్లాన మాట్లాడారు. మాజీ మంత్రి, వైసిపి శాసన మండలి ప్రతిపక్ష నాయకుడైన బొత్స సత్యన్నారాయణను ఉత్తరాంధ్ర ద్రోహిగా కళావెంకటరావు అభివర్ణిండం విడ్డూరంగా ఉందన్నారు. 40 ఏళ్ల పాటు మంత్రిగాను, ఎమ్మెల్యేగా పని చేసిన కళావెంకటరావు గానీ, ఆయన తమ్ముడు గానీ ఉత్తరాంధ్రకు గాని, శ్రీకాకుళం జిల్లాకు గానీ ఏం చేసారో చెప్పాలని ప్రశ్నించారు. సంకిలి నుండి చీపురుపల్లి నియోజకవర్గానికి తాగు నీటితో పాటు తోటపల్లి ద్వారా సాగు నీరు తీసుకు వచ్చిన ఘనత బొత్స సత్యన్నారాయణదేనని గుర్తు చేశారు. సొంత నియోజకవర్గం రాజాంకి సంకిలి నుండి కనీసం తాగడానికి గుక్కెడు నీరైనా కళావెంకటరావు తీసుకు వచ్చారా అని ప్రశ్నించారు. ఎచ్చెర్లలో గెలవలేక చీపురుపల్లి టిక్కెట్టు కళావెంకటరావుకి ఇచ్చారని అదృష్టవ సాత్తు గెలిచారే తప్ప ఇక్కడేమీ ప్రజలకు సేవ చేసింది లేదని అన్నారు. అధికారంలోనికి వచ్చి ఏడాది పూర్తయినప్పటికీ చీపురుపల్లి నియోజకవర్గానికి ఏం చేసారో చెప్పాలని ప్రశ్నించారు. గెలిచిన తరువాత ఏదో గెస్ట్‌లాగా చీపురుపల్లి వచ్చి మీ కొడుకు పుట్టిన రోజులు, మీ పుట్టిన రోజులు జరుపుకుంటున్నారే తప్ప చీపురుపల్లి ప్రజల కష్టసుఖాలు ఏనాడైనా పట్టించుకున్నారా అని అన్నారు. పదవుల కోసం కాపునాయకుడిన అని చెప్పి మంచి పరిపాలనా దక్షత ఉన్న బొత్స సత్యన్నారాయణను కించపరిచే విధంగా మాట్లాడటం తగదన్నారు. గత ఐదేళ్ల పాటు చీపురుపల్లి నియోజకవర్గానికి ఎటువంటి అభివృద్ధి చేసామో ప్రజల మధ్యనే చర్చించుకుందాం రావాలని సవాల్ విసిరారు. ఈ సమావేవంలో వైసిపి జిల్లా కార్యదర్శి ఇప్పిలి అనంతం, యువజన విబాగం నియోజకవర్గం అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులు అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి, సాలూరు నియోజకవర్గాల రైతులకు సాగునీరు అందించే ప్రాజెక్టుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మంత్రి గుమ్మడి సంధ్యారాణిని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. అమరావతిలో సోమవారం మంత్రిని కలిశారు. వెంగళరాయ సాగర్, పెద్దగెడ్డ ప్రాజెక్టుల నుంచి శివారు భూములకు సాగునీరు అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాతబొబ్బిలి వద్ద రోడ్డుపై పెద్ద గోతులు ఉండడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని, రోడ్డు బాగు చేసేందుకు నిధులు ఇవ్వాలని కోరారు.

మంత్రి సంధ్యారాణితో చర్చిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

అజ్జాడలో ఆలయ భూముల సమస్య పరిష్కరించాలి

పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం అజ్జాడలో ఉన్న శ్రీవేణుగోపాల స్వామి ఆలయ భూముల సమస్యను పరిష్కరించాలని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. అమరావతిలో సోమవారం మంత్రిని కలిసి పలు సమస్యలపై చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆలయాల్లో పని చేస్తున్న అర్చకుల దూప, దీప నైవేద్యం నిధులు విడుదల చేయాలని కోరారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించారు.

బాధితుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - కంటోన్మెంట్

బాధితుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించాలని డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తంగా 34 ఫిర్యాదులను స్వీకరించారు. స్వీకరించిన ఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించినవి 12 ఉన్నాయి. అనంతరం సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకు వివరించారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిసిఆర్‌బి సిఐ బి.సుధాకర్, ఎస్.రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

భూపట్టాలు పంపిణీ చేయాలి

గిరిజన, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-మెంటాడ

గిరిజనులు, దళితులు 50 ఏళ్లుగా సాగుచేస్తున్న అటవీ, బంజరు, ప్రభుత్వ భూములకు పట్టాలు పంపిణీ చేయాలని ఎపి గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాకోటి రాములు మాట్లాడుతూ మండలంలో సుమారుగా 1500 మంది దళిత, గిరిజనులు దశాబ్దాలుగా సాగుచేస్తున్న భూములకు పట్టాలు పంపిణీ చేయడంలో జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గత తహశీల్దార్ శ్రీనివాసరావు వద్ద పలుమార్లు అర్జీలు పెట్టుకున్న తరుణంలో భూసర్వే నిర్వహించారని, సర్వే అనంతరం సబ్ డివిజన్ చేయకపోవడంతో పంపిణీ చేయలేదని చెప్పారు. ఇంతలో ఆయన బదిలీపై వెళ్లిపోయారని తెలిపారు. ప్రస్తుత తహశీల్దార్ అరుణకుమారి స్పందించి, నిరుపేదలకు సబ్ డివిజన్ చేయించి అర్హులైన వారికి భూపట్టాలు పంపిణీ చేయాలని కోరారు. వీరికి అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తించేలా చర్యలు తీసుకోవాలని రాములు డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌కు దరఖాస్తులు అందజేశారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దళిత, గిరిజనులు

కాలుష్యాన్ని కలిసికట్టుగా నిర్మూలిద్దాం

కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి- కంటోన్మెంట్

ప్లాస్టిక్ కాలుష్యాన్ని నిర్మూలించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. మానవుల జీవన సరళిలో పర్యావరణానికి హాని చేసే వాటిని నిర్మూలించాలని, తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని తెలిపారు. గురువారం జెడ్‌పి సమావేశ మందిరం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జరిగిన వర్క్ షాప్ లో కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. అంతకు ముందు నగరం లోని అంబేద్కర్ కూడలి నుండి జిల్లా పరిషత్ వరకు ప్లాస్టిక్ ను నిర్మూలిద్దాం అనే నినాదంతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగం వలన కలిగే నష్టాల గురించి అవగాహన కలిగించాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ దుకాణాలపై దాడులు చేసి ఎక్కడా ప్లాస్టిక్ వినియోగం లేకుండా చూస్తున్నామని తెలిపారు. 15వేల వరకు మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. డిఎఫ్ఒ కొండల రావు మాట్లాడుతూ జనాభా పెరుగుదల వలన పర్యావరణం దెబ్బ తింటోందని, దీని పరిణామాలు భవిష్యత్తు వారికీ నష్టం కలిగిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఇఇ సరిత, జెడ్‌పి డిప్యూటీ సిఇఒ వెంకట రమణ, ప్రొఫెసర్ రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఉత్తమ కంపెనీలైన ఎంఎస్ఎం ఫార్మా, శారద మెటల్ , అంజన ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీల ప్రతినిధులకు కలెక్టర్ మెమెంటోలను అందజేశారు.

విద్యార్థులకు పుస్తకాలుపంపిణీ చేస్తున్న భారతి, తులసి, తదితరులు

నోట్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-వేపాడ

డిసిఎంఎస్ చైర్మన్ గొంప క్రిష్ణ చేపట్టిన విద్యా సంకల్పం కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. సోమవారం మండలంలోని కెజెపూడి, బంగారయ్యపేట, దుంగాడ, కడకొండ, ఎస్.కోట సీతారాంపురం గ్రామాల్లో విద్యార్థులకు తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు గుమ్మడి భారతి, బానాది ఎంపిటిసి గొంప తులసి.. నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జికె యువసేన నియోజకవర్గ అధ్యక్షులు ముక్కా రామకృష్ణ, ఉపాధ్యక్షులు పరవాడ జగదీష్, సభ్యులు నాగిరెడ్డి లక్ష్మణ్, బొత్స శ్రీను, కె.అప్పారావు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

బొబ్బిలిరూరల్ : మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఎంపిడిఒ రవికుమార్ కోరారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో నాలుగు మండలాల మహిళా సర్పంచులకు ఏర్పాటుచేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. పంచాయతీల్లో సమస్యలు ఎక్కువగా మహిళలకే తెలుస్తాయని చెప్పారు. అందుకు తగ్గట్టుగా మహిళా సర్పంచులు స్పందించాలని సూచించారు. పంచాయతీలకు వచ్చే నిధులపై అవగాహన ఉండాలని తెలిపారు. వీధి దీపాలు, పారిశుధ్య నిర్వహణలో ముందుడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ ఎ.భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో తనిఖీలు

తెర్లాం : మండలంలో పెరుమాళిలో అంగన్వాడీ కేంద్రాలను సోమవారం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అపర్ణ తనిఖీ చేశారు. పిల్లల హాజరు పట్టిక, అంగన్వాడీ సిబ్బంది పనితీరు, కేంద్రాల పరిశుభ్రతను పరిశీలించారు. ప్రీ స్కూల్ పిల్లలకు పౌష్టికాహారం అందించే విధానాన్ని, వంటలను పరిశీలించి, పిల్లలకు పెట్టే ఆహార రుచి, శుచి బాగున్నాయని కితాబిచ్చారు.

ఆక్రమణలు తొలగించాలి

బొబ్బిలి : పాకివీధి వెనుక పాత కంపోస్ట్ యార్డుకు దావాలువీధి రోడ్డు నుండి ట్రాక్టర్ వెళ్లే రస్తాను ఆక్రమించి గోడ కట్టారని, వెంటనే దానిని తొలగించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, కార్మికులు ఎం.ప్రసాద్, బి.వెంకటి మున్సిపల్ అధికారులకు వినతి అందించారు. ఆ స్థలాన్ని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని, ఆ గోడ పగలగొట్టి కార్మికులకు రహదారి చూపించాలని డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

బొబ్బిలి : సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె ఎనిమిదో రోజు సోమవారం కొనసాగింది. తమ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరుగుతున్న సమయంలో బయట ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఆ యూనియన్ కార్యదర్శి తెంటు రవి, కార్మికులు పాల్గొన్నారు.

సమ్మెలో విఆర్‌ఎల భాగస్వామ్యం

దత్తిరాజేరు : ఈ నెల 9న చేపట్టే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగస్వామ్యం అవుతామని విఆర్‌ఎలు స్పష్టంచేశారు. ఈ మేరకు డిటి రత్నకుమారికి సోమవారం సమ్మె నోటీసు అందజేశారు. విఆర్‌ఎల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో విఆర్‌ఎల సంఘం నాయకులు ఎస్.సింహాచలం, టి.పైడిరాజు, ఎం.శంకర్, కె.బంగారు రాజు, వై.ఎరుకు నాయుడు, సిహెచ్ బాలయ్య, జనార్ధన, గురువులు పాల్గొన్నారు.

తాగునీరు అందించాలి

మెంటాడ : కొండపర్తి, మల్లేడవలస, మిర్తివలస గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు సోమవారం ఎంపిడిఒ భానుమూర్తికి వినతి అందించారు. మెంటాడ నుంచి మల్లేడవలసకు, ఆంద్ర నుంచి కుంబివలసకు రోడ్డు నిర్మించి, కొండపర్తి వద్ద కల్వర్టు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు రాయిపల్లి రాము, దాట్ల హనుమంతరాజు, గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తామరపల్లి సోములు, జంగమయ్య, సిడగం జానకి, మల్లేడ రవి తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలను విజయవంతం చేయండి

శృంగవరపుకోట: పంచాయతీలలో మంగళవారం నుంచి నిర్వహిస్తున్న గ్రామసభలను విజయవంతం చేయాలని ఓటరు అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకులు దొడ్డి సూర్యారావు కోరారు. సోమవారం పట్టణంలోని ఓ ప్రయివేట్ హాల్లో జరిగిన సమావేశంలో దొడ్డి సూర్యారావు మాట్లాడారు. డిఎల్‌పిఒలు, డిడిఒలు, పంచాయతీ విస్తరణ అధికారులు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు బాధ్యత తీసుకోవాలని కోరారు. గ్రామసభలకు సభ్యులైన ఓటర్లు అందరూ తప్పకుండా హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో వేదిక ముఖ్య సలహాదారు వి.సన్యాసప్పడు, ప్రతినిధి లంక సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జెడ్‌పి చైర్మన్‌ను కలిసిన ఎంపిపి

వేపాడ : ఇటీవల వైసిపి బూత్ కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన ఎంపిపి దొగ్గ సత్యవంతుడు.. సోమవారం విజయనగరంలో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును మర్యాద పూర్వకంగా కలిశారు. శ్రీనివాసరావును సత్కరించి, కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, సీనియర్ నాయకులు దుల్ల మహేష్, ఎం.సత్యనారాయణ, రుద్ర వెంకట్రావు, సర్పంచులు మురిపిండి గంగరాజు, వెంకట్రావు, బాలబాబు, శ్రీను, రామనాయుడు, ఎంపిటిసిలు ఆకుల సత్తిబాబు, టి.వెంకటరమణ, జెసిఎస్ మండల కన్వీనర్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు

బొబ్బిలిరూరల్ : విధి నిర్వహణలో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ ఎం.శ్రీను సిబ్బందిని హెచ్చరించారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సిబ్బంది చిత్తశుద్ధితో, నిజాయతీతో విధులు నిర్వహించాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై సకాలంలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. జిఒ 30 ప్రకారం ప్రభుత్వ స్థలాల్లో 2019 ముందు నిర్మాణం చేపట్టిన ఇళ్లకు క్రమబద్ధీకరణ చేయడానికి వచ్చిన దరఖాస్తులపై దర్యాప్తు చేయాలని ఆదేశించారు. విఆర్‌ఒలు పాల్గొన్నారు.

జనార్ధనరాజు సేవలు మరువలేనివి

విజయనగరం : సాంఘిక సంక్షేమ శాఖ లో జనార్ధనరాజు సేవలు మరువలేనివని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.అన్నపూర్ణమ్మ అన్నారు. తమ శాఖలో సీనియర్ గా అందరికీ అందుబాటులో ఉంటూ అన్ని విషయాలు పట్ల అవగాహనా ఉన్న వ్యక్తి లేక పోవడం పెద్ద లోటని అన్నారు. ఉద్యోగ విమరణ చేసిన జనర్ధనారాజు దంపతులను సోమవారం ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో సహాయ సంక్షేమ అధికారులు స్వరూప రాజరావు, యూనియన్ నాయకులు రామాంజనేయులు, చంద్రినాయుడు, రిటైర్డ్ డిడి పట్నాయక్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జనార్ధనరాజు దంపతులను సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

వ్యవసాయాన్ని లాభసాటి చేస్తాం

మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు
బాధ్యతలు స్వీకరించిన ఎఎంసి పాలకవర్గం

ప్రజాశక్తి-గజపతినగరం

వ్యవసాయాన్ని అభివృద్ధి బాట పట్టించి లాభసాటి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని చిన్నతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గజపతినగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం స్థానిక మార్కెట్ యార్డులో సోమవారం ఘనంగా జరిగింది. చైర్మన్‌గా పివివి గోపాలరాజు, వైస్ చైర్మన్‌గా కోరాడ కృష్ణ, ఇతర పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. సుమారు 20 ఎకరాల్లో విస్తరించి ఉన్న గజపతినగరం మార్కెట్ యార్డును అభివృద్ధి చేసి, రైతులకు ప్రయోజనం చేకూర్చేలా తీర్చిదిద్దాలని, రైతుకు వెన్నెముకగా నిలబడాలని పాలకవర్గాన్ని కోరారు.

కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. రాజ్యాంగాన్ని, చట్టాన్ని గౌరవిస్తూ విధులను నిర్వహించాలని సూచించారు. ఎఎంసి నూతన చైర్మన్ పివివి గోపాలరాజు మాట్లాడుతూ.. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వహించి, రైతులందరికీ మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ప్రమాణ స్వీకారం చేసిన ఎఎంసి పాలకవర్గంతో మంత్రి కొండపల్లి, మాజీమంత్రి అశోక్

కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, మార్కెటింగ్ శాఖ ఎడి బి.రవికిరణ్, మాజీ మంత్రి పడాల అరుణ, వైస్ చైర్మన్ కోరాడ కృష్ణ, కూటమి నాయకులు కొండపల్లి కొండలరావు, మక్కువ శ్రీధర్, గంట్యాడ శ్రీదేవి, మద్రాపు సురేష్, విజయనగరం ఎఎంసి చైర్మన్ కర్రోతు నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సుదీర్ఘ చర్చ

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపల్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కౌన్సిల్ సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో సోమవారం చైర్మన్ రాంబార్కి శరత్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, పలు అభివృద్ధి పనులకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. వైసిపి కౌన్సిలర్ ఇంటి గోవిందరావు మాట్లాడుతూ మున్సిపల్ వాటర్ ట్యాంకు వద్ద నైట్ వాచ్‌మెన్ లేకపోవడంతో రాత్రి సమయాలలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వాటర్ ట్యాంక్ డ్రైవర్ మద్యం తాగి ట్రాక్టర్ నడపడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తంచేశారు. మల్లమ్మపేట అంబేద్కర్ కాలనీలో కాలువ సక్రమంగా లేకపోవడంతో ఇళ్లలోకి మురుగునీరు వెళ్తుందని, కాలువ నిర్మాణం చేపట్టాలని కోరారు. మున్సిపల్ కార్యాలయ పోర్టుకో వద్ద తొలగించిన కుర్చీలు వేయాలన్నారు. ఆడిట్ కమిటీ తిరస్కరించిన బిల్లులు ఏవో చెప్పాలని కోరారు. కౌన్సిలర్ చోడిగంజి రమేష్ నాయుడు మాట్లాడుతూ కౌన్సిల్ ఆమోదం పొందుతున్న పనులు సక్రమంగా జరగడం లేదన్నారు. కౌన్సిల్ ఆమోదం పొందిన అన్ని పనులు పూర్తి అయ్యేలా చూడాలని, కాంట్రాక్టర్లకు బిల్లులు సకాలంలో చెల్లించాలని డిమాండ్‌చేశారు. వాటర్ సరఫరా విభాగంలో పాత కార్మికులను కొనసాగించాలని, మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. లీకుల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ కార్యాలయ సమీపంలో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళి మాట్లాడుతూ తాగునీరు సక్రమంగా పంపిణీ చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రస్తావించారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీరు సక్రమంగా అందేలా చూడాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయ పోర్టుకో వద్ద తొలగించిన కుర్చీలను ఏర్పాటు చేయాలని వైసిపి కౌన్సిలర్లు కోరగా, ఏర్పాటు చేసే ప్రసక్తే లేదని చైర్మన్ శరత్ చెప్పారు. దీంతో ఇరువురి మధ్య కొంతసమయం వాగ్వాదం చోటుచేసుకుంది. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సమస్యలపై వాగ్వివాదం చేస్తున్న కౌన్సిలర్లు

అదనపు నిధులు తెచ్చేందుకు కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- నెల్లిమర్ల

అభివృద్దే తన అజెండా అని, ప్రజల మేలు కోసం నిరంతరం కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ అధ్యక్షతన సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేవలం ప్రభుత్వం కేటాయించిన నిధులతో మాత్రమే కాకుండా, ప్రభుత్వం నుండి అదనపు నిధులు తీసుకురావడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నానని చెప్పారు. తాజాగా విఎంఆర్‌డిఎ ద్వారా నెల్లిమర్ల నగర అభివృద్ధి కోసం రూ.2 కోట్లు నిధులు మంజూరైందని తెలిపారు. తనకు ఎలాంటి రాజకీయ వ్యత్యాసాలూ ఉండవని, తాను ప్రజల మేలు కోసమే పనిచేస్తున్నానని చెప్పారు. సమావేశంలో నరగపంచాయతీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగమాధి

సిఎం సహాయనిధి పంపిణీ

డెంకాడ : నియోజకవర్గానికి చెందిన ముగ్గురు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన సుమారు రూ.4.5 లక్షల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే లోకం మాధవి సోమవారం బాధితులకు అందించారు. భోగాపురం మండలం గూడెపువలసకు చెందిన సరగడ రాముదాసుకు రూ. 2.20లక్షలు, చిన్నరావాడకు చెందిన బమ్మిడి సూరికి రూ.62వేలు, పెద్దరావాడ గ్రామానికి చెందిన గొంప సాగర్‌కి రూ.1.63లక్షలు చెక్కులను ఆమె అందించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీటి పైపులైన్ పనులకు శ్రీకారం

భోగాపురం మండలంలోని ముక్కాం గ్రామం ప్రజలు 25ఏళ్లగా ఎదురు చూస్తున్న ఇంటింటికీ తాగునీటి పైపులైన్‌ను ఎమ్మెల్యే లోకం నాగమాధవి సోమవారం ప్రారంభించారు. వివిధ వనరుల నుండి నిధులు సమీకరించి, గ్రామంలోని ఇంటింటికీ తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరగా పనులు పూర్తి చేసి ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శారదా పరిశ్రమ ఉదారత

ప్రజాశక్తి-కొత్తవలస

శారదా పరిశ్రమ యాజమాన్యం ఉదారతను చాటుకుంది. ఇటీవల కొత్తవలస కెజివిబిలో సంభవించిన అగ్నిప్రమాదంలో సుమారు 250 పరుపులు కాలిపోయిన విషయం తెలిసిందే. దీంతో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి స్పందించి, శారదా పరిశ్రమ యాజమాన్యంతో చర్చించారు. ఆ పరిశ్రమ సిఎస్ఆర్ నిధులతో 70 పరుపులను సోమవారం కెజిబివి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న రోజుల్లో కెజిబివికి కావలసిన వసతులను సమకూర్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. శారదా కర్మాగార ప్రతినిధి సన్యాసిరావు మాట్లాడుతూ పరిశ్రమ సిఎస్ఆర్ నిధులతో చుట్టుపక్కల ప్రాంతాల్లో అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి కోళ్ల వెంకటరమణ, చింతలపాలెం సర్పంచ్ మాకిన సీతారాం పాత్రుడు, శారదా కర్మాగార హెచ్ఆర్ శంకర్రావు, కోరుపోలు అప్పారావు, లెంక శ్రీను, పి.రత్నాజీ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి- డెంకాడ

పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులు, ఆయాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎంఇఒకు సిఐటియు ఆధ్వర్యంలో వారంతా కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బచ్చల సూర్యనారాయణ మాట్లాడుతూ నిత్యవసరాలు, గ్యాస్ నిరంతరం పెరగడంతో పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టడం కష్టంగా ఉందన్నారు. బిల్లులు కూడా ఎప్పటికప్పుడు ఇవ్వకపోవడంతో పథక నిర్వహణ కష్టంగా మారుతోందన్నారు. ఆయాలకు గౌరవ వేతనం కూడా తక్కువ ఇవ్వడంతో కుటుంబ పోషణ కష్టంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో జూలై 9న దేశ వ్యాప్తంగా చేపట్టనున్న సమ్మెలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

త్రినాధరావు దంపతులను సత్కరిస్తున్న జెడ్‌పి చైర్మన్, అధికారులు, సిబ్బంది

త్రినాధరావు అందరివాడు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా పరిషత్ పరిపాలనాధికారి ఎ.త్రినాదరావు ఎక్కడ పనిచేసినా అక్కడ ఉన్న అధికారులు, సహచర ఉద్యోగలందరినీ కలుపుకొని అందరివాడిగా గుర్తింపు తెచ్చుకున్నారని పలువురు కొనియాడారు. సోమవారం జిల్లా పరిషత్‌లోజరిగిన త్రినాధరావు ఉద్యోగ విరమణ సన్మాన సభలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, సిఇఒ సత్యాన్నారాయణ, డిప్యూటీ సిఇఒ వెంకటరమణ, డిఎల్‌డిఒ రవీందర్ మాట్లాడారు. ప్రజలు, ప్రజాప్రతినిధులందరితో కలుపుగోలుగా ఉంటూ ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారని అన్నారు. సహచర ఉద్యగులు, స్నేహితులు, కుటుంబసభ్యులు ఆయన తో ఉన్న అనుబంధాలను పంచుకున్నారు. అనంతరం త్రినాధరావు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పిఆర్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సిహెచ్ మురళి, ఎ.సురేష్, పలువురు ఎంపిడిఒలు, పంచాయతీ రాజ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సత్యనారాయణరావు సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో ఆడియో విజువల్ సూపర్వైజర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన డి. సత్యనారాయణరావు కు కార్యాలయ అధికారులు, సిబ్బంది, జర్నలిస్టులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఒక ప్రైవేట్ హోటల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో జిల్లా యంత్రాంగం తరుపున జిల్లా రెవిన్యూ అధికారి శ్రీనివాసమూర్తి హాజరై శాలువ, జ్ఞాపిక తో సత్కరించి, అభినందనలు తెలిపారు. 35ఏళ్ల సుదీర్ఘ ఉద్యోగకాలంలో సత్యనారాయణరావు విశేష సేవలు అందించారని, ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు. ప్రభుత్వ కార్యక్రమాల ప్రచార విధులలోనూ, ముఖ్యుల కార్యక్రమాల నిర్వహణలోనూ, మీడియా సంబంధాలలోనూ ఆయన ఘనమైన సేవలు అందించారని తెలిపారు. సమాచారశాఖ విశ్రాంత సహాయ సంచాలకులు టి.అప్పారావు, పార్వతీపురం సహాయ సంచాలకులు ఎల్. రమేష్, ఇంచార్జి డిఐపిఆర్ఒ ఎం. మల్లేశ్వరరావు, డివిజనల్ పిఆర్ఒ జానకమ్మ, సీనియర్ జర్నలిస్టులు ఎలిశెట్టి సురేష్, బూరాడ శ్రీనువాసు అతిధులుగా హాజరై సత్యనారాయణరావు సేవలను కొనియాడారు. ఇతర సిబ్బంది వారితో పనిచేసిన అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన సమాచార పౌర సంబంధాల శాఖ సిబ్బంది, పత్రికా విలేఖరులు, ఉద్యోగ విరమణ చేసిన అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు హాజరై సత్యనారాయణరావు దంపతులకు అభినందనలు తెలిపారు.

సత్యనారాయణరావు దంపతులను సత్కరిస్తున్న డిపిఆర్ఒ కార్యాలయ సిబ్బంది

మీడియాపై దాడి సరికాదు : సిపిఎం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలోని ఏలూరులో సాక్షి కార్యాలయంపైనా, హైదరాబాద్‌లో మహా న్యూస్ ఛానల్ కార్యాలయంపైనా దాడులు, విజయనగరంలో జర్నలిస్టులపై దౌర్జన్యం వంటివి తగదని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ తెలిపారు. ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విజయనగరంలోని అయ్యప్పనగర్లో దొంగతనం జరిగిన ఇంట్లో సమాచారం సేకరించేందుకు వెళ్లిన టెన్ టివి రిపోర్టర్‌పై ఎస్ఐ దౌర్జన్యానికి పాల్పడడం సరైనది కాదన్నారు. తెలంగాణాలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మహా న్యూస్ ఛానల్ కార్యాలయంపైనా మన రాష్ట్రంలో ఏలూరులో కూటమి నాయకులు, కార్యకర్తలు సాక్షి కార్యాలయం పై దాడిచేయడాన్ని ఖండించారు.

రహదారిని గాలికి వదిలేస్తారా?

అధికారుల తీరుపై సిపిఎం ఆగ్రహం

ప్రజాశక్తి-వేపాడ

సోంపురం– ఆనందపురం రహదారిని పూర్తిచేయకుండా గాలికి వదిలేస్తారా? అని సిపిఎం జిల్లా నాయకులు సిహెచ్ జగన్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం వేపాడలో రహదారిపై ఏర్పడిన గుంతలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి బొత్స సత్యనారాయణ రోడ్డు పనులు ప్రారంభించారని, ఏళ్లు గడుస్తున్నా ఈ రహదారి నిర్మాణం ముందుకు సాగడం లేదని చెప్పారు. కాంట్రాక్టరు పనులు మధ్యలో వదిలేసి వెళ్లిపోయినా అధికారులు పట్టించుకోక పోవడం దారుణమన్నారు. దీంతో మండల కేంద్రానికి రావాలంటే ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి రహదారి పనులు పూర్తిచేయాలని డిమాండ్‌చేశారు.

సమిష్టి పోరాటంతో ఆర్థిక ప్యాకేజి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కార్మిక సంఘాల సమిష్టి పోరాటంతో గరివిడి ఫేకర్ శాశ్వత కార్మికులకు ఆర్థిక ప్రయోజనం చేకూరిందని సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఫేకర్‌లో పనిచేస్తున్న 56 మంది శాశ్వత కార్మికులకు ఆర్థిక ప్యాకేజీ ప్రకటించి వారిని తొలగించేందుకు యాజమాన్యం ఒప్పుకుందన్నారు. కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటి, యాజమాన్యంతో చర్చలు జరిపి తొలగింపు సమస్య పరిష్కారం చేసిందన్నారు. దీనిలో భాగంగా శాశ్వత కార్మికుల తొలగించి వారికి ఆర్థిక ప్రయోజనం చేకూర్చడంలో కార్మిక సంఘాల జెఎసి కృషి ఉందని తెలిపారు. సమిష్టి పోరాటాలతో సమస్యలు పరిష్కారమవుతాయనడానికి ఇదో మంచి ఉదాహరణ అని చెప్పారు.

నాయీ బ్రాహ్మణుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పిఎం విశ్వ కర్మ రుణాలు సిబల్ స్కోర్‌తో సంబంధం లేకుండా ఇవ్వాలని సోమవారం కలెక్టరేట్ వద్ద నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టివి దుర్గారావు మాట్లాడుతూ విశ్వకర్మ రుణాలను సిబిల్ స్కోర్ పేరుతో నిలిపి వేస్తున్నారని, అధిక వడ్డీలతో, ఆన్లైన్ బ్యాంకింగ్ లతో ఇబ్బందులు పడుతున్న వారికి ప్రభుత్వంభరోసా కలిగించే విధంగా రుణాలు అందించాలన్నారు, ట్రయినింగ్ పొందిన వారికి ఇస్తామన్న టూల్ కిట్స్ వెంటనే ఇవ్వాలని, స్టైపండ్ కూడా అందరికి ఇవ్వాలని, ముద్రా రుణాలు పొదుపు గ్రూప్ లకు లింక్ చెయ్యాకుండా ఇవ్వాలని కోరారు కార్యక్రమంలో ఎం.రాము, ఐ. సత్యం, దేవుడుబాబు, ఎం.రాము, తాతబాబు, పోలీస్, ఈశ్వర్, సన్నిబాబు, త్రినాద్, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అవయవ దాతల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా శివాజీ

ప్రజాశక్తి- కంటోన్మెంట్

అఖిలభారత అవయవదాతల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా షిణగం శివాజీని నియమించినట్లు ఆ సంఘం వ్యవస్థాపకురాలు, సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్(స్పెక్ట్) చైర్మన్ డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఈనెల 29న సింహాచలంలో జరిగిన ఒక కార్యక్రమంలో నియామక ఉత్తర్వులను శివాజీకి అందజేశారు. శివాజీ మాట్లాడుతూ అఖిలభారత అవయవదాతల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా తనకి అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నెరవేరుస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎస్.వి రమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్ బాలు పాల్గొన్నారు.

నగర క్రమబద్ధీకరణకు సహకరించాలి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర క్రమబద్ధీకరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. గాంధీ విగ్రహం వద్ద రహదారులను, ఫుట్ పాత్ లను ఆక్రమించి చేపడుతున్న చిరు వ్యాపారస్తులను ప్రణాళిక సిబ్బంది తరలించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో నిర్దేశిత ప్రాంతాలలో మాత్రమే చిరు వ్యాపారాలు సాగించుకోవాలని చెప్పారు. రహదారులను, ఫుట్పాత్ లను, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి చిరు వ్యాపారాలు చేపట్టరాదని సూచించారు.

గ్రీన్ అంబాసిడర్ల ఆందోళన

ప్రజాశక్తి-రామభద్రపురం

గ్రీన్ అంబాసిడర్లకు బకాయి వేతనాలు వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బలస శ్రీను డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద గ్రీన్‌అంబాసిడర్లు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం గ్రామాలను శుభ్రం చేస్తూ ప్రజారోగ్య పరిరక్షణలో శ్రమిస్తున్న కార్మికులకు 6 నుంచి 15 నెలల జీతాలు బకాయిలు ఉంచడం అన్యాయమన్నారు. వెంటనే బకాయి జీతాలు ఇవ్వాలని ఎంపిడిఒ రత్నానికి వినతిపత్రం ఇచ్చారు. దీనిపై ఎంపిడిఒ స్పందిస్తూ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి వేతన బకాయిలు చెల్లించే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రీన్‌అంబాసిడర్లు పోలిరాజు, గంగరాజు, రామకృష్ణ, శ్రీరామ్, రాము, తదితరులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-డెంకాడ

భోగాపురం మండల కేంద్రంలో అనారోగ్యంతో యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామంలోని తోటవీధికి చెందిన కె. రాజశేఖర్(25) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు మద్యం తాగడంవలనే అనారోగ్యం పాలయ్యావని మందలించడం తో ఇంట్లో ఎవరూ లేని సమయంలోఉరివేసుకొని మృతి చెందాడు. మృతిని తల్లి ఫిర్యాదు మేరకు ఎస్ఐ పాపారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

వర్షాలు కురుస్తున్న కారణంగా సీజనల్ వ్యాధులు. జ్వరాలు, ప్రబలే అవకాశమున్నందున ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కనకాచారి, గౌరవాధ్యక్షులు ఐ.గోపాలరావు సూచించారు. గురువారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారుమాట్లాడుతూ ప్రజలు పరిసరాలు పరిశుభ్రత పాటించాలని, వేడి నీఉఉ, వేడి ఆహారం తీసుకోవాలని నిలవ ఉంచిన ఆహారం తీసుకోవద్దని సూచించారు. గ్రామీణ వైద్యులు ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహనా కల్పించి ప్రజలు అనారోగ్యం పాలు కాకుండా చూడాలని కోరారు. వ్యాధులు ప్రబలిన వారికి తగిన సలహాలు ఇచ్చి గ్రామీణ ప్రాంతంలో ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని తెలిపారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో రమేష్ సత్తా

బొబ్బిలి : ఢిల్లీలో జరిగిన బాడీ బిల్డింగ్ పోటీలలో బొబ్బిలికి చెందిన బి.రమేష్ ప్రతిభ కనబరిచాడు. గత నెల 29న ఢిల్లీలో నరేష్ సూర్య క్లాసిక్ ఆధ్వర్యంలో బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించారు. జూనియర్ క్లాసిక్ పోటీలో రమేష్ నాలుగో స్థానం, జూనియర్ మెన్స్ విభాగంలో ఐదో స్థానం సాధించి సత్తా చాటాడు. రమేష్‌కు కోచ్ రోహిత్ శిక్షణ ఇస్తున్నారు.

ఏనుగులను అటవీ ప్రాంతానికి తరలించాలి

వంగర : ఏనుగులను అటవీ ప్రాంతానికి తరలించి తమను ఆదుకోవాలని మన్యం జిల్లా రేంజ్ అధికారి కె.మణికంటేష్‌ను కోరారు. మడ్డవలస సమీపంలో ఏనుగులు కదలికలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు కలిసి తమకు జరిగిన నష్టాన్ని వివరించారు. ఆదుకోవాలని కోరారు.